తిరుమలలో వేసవి రద్దీ ప్రారంభం

14-18 తేదీల్లో హనుమత్ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - తిరుమల

మే 14-18 తేదీల్లో ఐదు రోజుల పాటు హనుమత్ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో భక్తులతోనూ, అనంతరం మీడియాతోనూ మాట్లాడారు. తిరుమలలో వేసవి రద్దీ ప్రారంభమయ్యిందని, రోజుకు శ్రీవాణి, ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300, ఎస్ఎస్‌డి, దివ్య దర్శనం టోకెన్లు కలిపి 55వేలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. సర్వదర్శనంలో రోజుకు 10 నుంచి 15వేల మందికి మాత్రమే దర్శనం కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. భక్తులు ఓపికతో టిటిడికి సహకరించి స్వామివారి దర్శనం చేసుకోవాలన్నారు. హనుమత్ జయంతి ఉత్సవాలలో భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా తిరుమలలోని అంజనాద్రి, ఆకాశగంగ, నాదనీరాజనం వేదికలపై అన్నమాచార్య, దాస సాహిత్య, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులతో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం మే 16న ఉదయం 5.50 నుండి రాత్రి 10.30 గంటల వరకు దాదాపు 18 గంటల పాటు నిరంతరాయంగా కొనసాగుతుంది. సుందరకాండలోని మొత్తం 2,872 శ్లోకాలను వేద పండితులు పారాయణం చేస్తారు. అంజనాద్రే ఆంజనేయుని జన్మస్థలమని టిటిడి పండిత మండలి పౌరాణిక, చారిత్రిక, భౌగోళిక ఆధారాలతో ధృవీకరించినట్లు తెలిపారు. తిరుమలలోని ఎస్వీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను రేమాండ్స్ సంస్థకు చెందిన సింఘానియా ట్రస్టు దత్తత తీసుకుందని, విద్యాప్రమాణాలను మరింత మెరుగుపరచి అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా ట్రస్టు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇదే స్ఫూర్తితో టిటిడిలోని మరిన్ని పాఠశాలలను దత్తత తీసుకోడానికి సింఘానియా ట్రస్టు ముందుకు రావడం సంతోషకరమైన విషయమన్నారు. ఏప్రిల్ నెలలో 20.95 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 114.12 కోట్ల ఆదాయం హుండీ ద్వారా లభించింది. జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిశోర్, సిఇ నాగేశ్వరరావు, ఎస్‌విబిసి సిఈవో షణ్ముఖ్‌కుమార్ పాల్గొన్నారు.

నర్సులు నిజమైన సేవకులు

స్ఫూర్తిదాయకంగా నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సమాజంలో నర్సులే నిజమైన సేవకులని డాలర్స్ గ్రూప్ అధినేత డాక్టర్ సి.దివాకర్ రెడ్డి అన్నారు. డాలర్స్, గెహిణి గ్రూప్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి రుయా ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీనియర్ నర్సులను ఘనంగా సత్కరించారు. రుయా, మెటర్నటీ ఆసుపత్రిలో సేవలందిస్తున్న 500 మందికి పైగా నర్సులకు గొడుగులను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ వైద్యరంగంలో నర్సుల సేవలు అత్యుత్తమమైనవని కొనియాడారు. కోవిడ్ మహమ్మారిలోనూ ప్రాణాలకు తెగించి సేవలు అందించారని అభినందించారు. రుయాభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్ మాట్లాడుతూ వైద్యులు 10 శాతం రోగులను పర్యవేక్షిస్తే, నర్సులు 90 శాతం రోగులతో సంబంధాలను కొనసాగిస్తూ మనస్ఫూర్తిగా సేవలు అందిస్తున్నారన్నారు. రుయా ఇన్చార్జ్ సూపరింటెండెంటు డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ నర్సుల సేవలు అత్యున్నతమైనవని కొనియాడారు. ఆర్ఎంఓ డాక్టర్ యువఅన్వేష్ రెడ్డి మాట్లాడుతూ నర్సులు మానవత్వానికి ప్రతి రూపమన్నారు.వైద్య రంగంలో డాక్టర్లకన్నా నర్సుల సేవలే రోగిని సాధారణ స్థితికి తీసుకొస్తాయన్నారు. సకాలంలో ఇంజక్షన్లు, మందులు ఇవ్వడం, రోగం నయం చేసి ఇంటికి పంపించే క్రమంలో రోగిని సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తారన్నారు. అనంతరం నైటింగేల్ చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సిఎస్ఆర్ఎంఓ రవి, నర్సింగ్ సూపరింటెండెంట్ అరుణమ్మ, నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు భువనేశ్వరి, హెడ్ నర్సులు సరోజ, శైలజ, మానస, లోకేష్ బాబు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో... స్థానిక శ్రీపద్మావతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి టిటిడి జేఈవో సదాభార్గవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు, డైరెక్టరు డాక్టరు వెంగమ్మ, సీనియర్ ప్రొఫెసర్ డాక్టరు శివకుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు సుధారాణి, ఏడి నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతి సంయుక్తంగా జ్యోతిప్రజ్వలన చేసి, ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ వైద్యరంగంలో నర్సింగ్ వృత్తి మహోన్నతమైనదన్నారు. నర్సింగ్ వృత్తి దైవత్వంతో కూడుకున్నదని, ఫ్లోరెన్స్ నైటింగేల్ స్వచ్ఛంద సేవకురాలిగా సమాజానికి నర్సింగ్ సేవలందించిందని, ఆ వృత్తికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిపెట్టారని కొనియాడారు. ఒక వ్యక్తి అంతర్జాతీయ గుర్తింపు పొందడం చిన్న విషయం కాదన్నారు. లింగ వివక్షకు తావులేకుండా మహిళలతో పాటు పురుషులకు నర్సింగ్ విద్యను స్విమ్స్ నర్సింగ్ కళాశాల బోధించడం అభినందనీయమన్నారు. నర్సింగ్ విద్యార్థులు కాలనుగుణంగా కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరముందన్నారు. కరోనా కాలంలో స్విమ్స్‌లో నర్సులు అందించిన సేవలను వెలకట్టలేమని పేర్కొన్నారు. డైరెక్టరు డాక్టరు వెంగమ్మ మాట్లాడుతూ కరోనా కాలంలో ప్రాణాపాయస్థితిలో ఉన్న 17వేల మంది రోగులకు స్విమ్స్ నర్సులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారన్నారు. ఈ క్రమంలో ఒక హెడ్ నర్సు, మరో స్టాఫ్ నర్సు కరోనాతో చనిపోయారని, చాలా మంది కరోనా పాజిటివ్ కారణంగా క్వారంటైన్‌లోకి వెళ్లిపోయిన నేపథ్యంలో తక్కువ మంది సిబ్బందితోనే రోజుకు కనీసం 6వేల మంది కరోనా రోగులకు సేవలందించారని తెలిపారు. అనంతరం స్విమ్స్ నర్సింగ్ అసోసియేషన్ ద్వారా నర్సులను సన్మానించారు. వివిధ పోటీలలో గెలుపొందిన 20 మందికి, వృత్తి నిర్వాహణలో ప్రతిభ కనబరిచిన 17 మంది నర్సులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

నేడు 'శుద్ధ తిరుమల..సుందర తిరుమల'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'శుద్ధ తిరుమల.. సుందర తిరుమల' కార్యక్రమంలో భాగంగా అధికార యంత్రాంగం శనివారం స్వచ్ఛందంగా పాల్గొని తిరుమల మార్గంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిద్దామని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. తిరుమల రెండు ఘాట్‌రోడ్లు, రెండు నడకదారుల్లో శనివారం టిటిడి ఉద్యోగులతో కలిసి సామూహికంగా శుద్ధి చేసే కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. తిరుమలను పర్యావరణహితంగా మార్చడంలో భాగంగా చేసే ఈ కార్యక్రమం వల్ల భక్తుల్లో సామాజిక స్పృహ వస్తుందన్నారు. ఉద్యోగులు అంకితభావంతో పాల్గొని ఆదర్శంగా నిలవాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస రావు, డిఎఫ్ఓ సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిద్దాం : కలెక్టర్

విద్యాహక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలవ్వాలి

తిరుపతి టౌన్ : విద్యాహక్కు చట్టం మేరకు రెండో ఫేజ్‌లో విద్యార్థులను మరింతగా నమోదు చేయించాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ 'నాడునేడు' కార్యక్రమం కింద మంజూరైన పాఠశాలల నిర్మాణాలు, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనపై డిఇఒ, డిప్యూటీ డిఇఒ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రోగ్రాం అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మంజూరు చేసిన 400 కిచెన్ షెడ్లలో 342 పురోగతిలో ఉన్నాయని తెలపగా, మిగిలిన వివిధ స్టేజీలలో ఉన్న వాటిని, మేజర్ మరమ్మతులు, మైనర్ మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పది, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు రెమిడీయల్ టీచింగ్ ఏర్పాటు ఉండాలన్నారు. జిల్లాలో గుర్తించిన 617 మంది బడిబయటి పిల్లలను గుర్తించిన వారిలో ప్రత్యామ్నాయ బ్రిడ్జి కోర్సుల్లో చేర్పించాలన్నారు. విద్యా హక్కు చట్టం కింద రెండవ ఫేజ్ లో 252 మంది మాత్రమే నమోదు అయ్యారని, మరింత ఎక్కువమంది ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో చేరేలా నమోదుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా విద్యాధికారి వి శేఖర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎస్ ఎస్ ఏ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పాస్టర్లందరికీ గౌరవ వేతనం ఇవ్వాలి

తిరుపతి సిటి : ప్రతి ఒక్క పాస్టర్‌కు గౌరవేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టరు ఎలమంచిలి ప్రవీణ్ విన్నవించారు. వైఎస్ఆర్ స్టేడియం వద్ద ముఖ్యమంత్రిని కలిసిన ఆయన దుశ్శాలువాతో సత్కరించి పూల గుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని అందించారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని దళిత క్రైస్తవుల సమస్యని అసెంబ్లీలో ప్రవేశపెట్టడం, ఆ బిల్లుని పాస్ చేయడమే కాకుండా సుప్రీంకోర్టులో ఉన్నటువంటి కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంక్లూడ్ కావడం ఒక చరిత్ర అన్నారు. అదే సమయంలో దేశంలోనే ఏ ప్రభుత్వము చేయని సాహసం చేసి పాస్టర్లకి గౌరవ వేతనం ఇవ్వడం అభినందనీయమని, కానీ దాదాపు 25 వేల మంది పాస్టర్లకు గౌరవ వేతనం ఇంకా రావడం లేదని, ప్రతి ఒక్కరికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున, ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

19న డాక్టర్ నీలం సంజీవరెడ్డి పురస్కారాలు ప్రదానం

తిరుపతి టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రథమ ముఖ్యమంత్రిగా, లోక్ సభ స్పీకర్ , కేంద్ర మంత్రిగా, ఆరవ భారత రాష్ట్రపతిగా విశేషమైన సేవలందించిన డాక్టర్ నీలం సంజీవరెడ్డి 110వ జయంతి సందర్భంగా భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ (అగ్రశ్రీ) ఈనెల 19వ తేదీన సాయంత్రం 4 గంటలకు తిరుపతిలోని హెూటల్ బ్లిస్ దర్బార్ సమావేశ మందిరంలో డాక్టర్ నీలం సంజీవరెడ్డి స్మారక ఉపన్యాసం, రాష్ట్ర పురస్కారాల ప్రధాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అగ్రశ్రీ సంచాలకుడు డాక్టర్ డి. సుందరరామ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా పనిచేసిన డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ డాక్టర్ నీలం సంజీవరెడ్డి ప్రథమ స్మారకోపన్యాసం చేస్తారని, అలాగే డాక్టర్ నీలం సంజీవరెడ్డి విశిష్ట రత్న రాష్ట్ర పురస్కారాన్ని స్వీకరిస్తారని డాక్టర్ సుందరరామ్ వివరించారు. భారత గ్రామీణ అధ్యయనం పరిశోధన అకాడమీ (అగ్రశ్రీ) వ్యవస్థాపక అధ్యక్షుడు , లోక్ సభ విశ్రాంత ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్ కశ్యప్ అధ్యక్షతన జరిగిన డాక్టర్ నీలం సంజీవరెడ్డి రాష్ట్ర పురస్కారాల న్యాయ నిర్ణేతల మండలి సమావేశంలో ఈ కింది వారిని పురస్కారాలకు ఎంపిక చేసినట్లు కన్వీనర్ డాక్టర్ డి సుందరరామ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ఉపసభాపతి రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ (విశిష్ట రత్న), ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జి. ఎతిరాజులు (న్యాయ శిరోమణి), అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ చొప్ప గంగిరెడ్డి (విద్యా శిరోమణి), స్విమ్స్ యూనివర్సిటీలో ప్రముఖ కార్డియాలజిస్ట్ ఆచార్య డి. రాజశేఖర్ (వైద్య శిరోమణి), పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ అధికారి జీ.వీ.కే. మల్లికార్జునరావు (పంచాయతీరాజ్ శిరోమణి) రాష్ట్ర పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలం సంజీవరెడ్డి 110వ జయంతి సందర్భంగా అగ్రశ్రీ ప్రచురించిన విశేష సంచికను ఆవిష్కరించనున్నట్లు డాక్టర్ డి సుందరరామ్ తెలియజేశారు.

ఎలక్ట్రోస్టీల్ కృషితో 'కంప్యూటర్ అక్షరాస్యత' శిక్షణ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఈ పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానంతో పరిచయం తప్పనిసరి నైపుణ్యంగా మారింది. గ్రామీణ భారతదేశంలో డిజిటల్ విద్యను ప్రోత్సహించే దక్పథానికి అనుగుణంగా, భారతదేశంలోని డక్టైల్ ఐరన్ పైపులు, ఫిట్టింగ్‌ల తయారీలో అగ్రగామిగా ఉన్న ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ ఇటీవల తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద కంప్యూటర్ అక్షరాస్యత శిక్షణను ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి వర్క్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సురేష్ ఖండేల్వాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని తిరుపతి జిల్లాలో. ఈసిఎల్-శ్రీకాళహస్తి, తొండమనాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుండి 9 తరగతుల విద్యార్థులకు జూన్ 2022 నుండి ఏప్రిల్ 2023 వరకు సుమారు 140 మంది విద్యార్థులకు కంప్యూటర్ అక్షరాస్యత కార్యక్రమాలను నిర్వహించింది. ఈ శిక్షణా కార్యక్రమం నిరంతర సిఎస్ఆర్‌గా భావించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఏడాది పొడవునా కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించారు. 200-250 మంది విద్యార్థులు చదువుతున్న రాచగున్నేరి గ్రామంలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో తదుపరి 2023-24 శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం తిరుపతి జిల్లాలోని 6 గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల జ్ఞానాన్ని అంచనా వేయడానికి క్రమంతప్పకుండా కంప్యూటర్ క్విజ్ పోటీలు, టెట్‌లను నిర్వహిస్తున్నారు.

చంద్రబాబుకు భద్రత పెంచాలి: ఆర్ సి మునికృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అంతమొందించాలనే కుట్రలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం చంద్రబాబు భద్రత విషయంలో కలుగజేసుకుని పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని టిడిపి కార్పొరేటర్ ఆర్ సి మునికృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కలిగిన చంద్రబాబు కాన్వాయ్ లోకి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టిక్కర్లు కలిగిన రెండు వాహనాలు దాదాపు 15 కిలోమీటర్లు ఎలా ప్రయాణించాయని, దీన్నిబట్టి చూస్తే చంద్రబాబుపై సజ్జల రామకష్ణారెడ్డి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుట్ర పన్నారని స్పష్టమవుతుందన్నారు. జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కలిగిన వ్యక్తి చంద్రబాబుకు పోలీసు శాఖ నామ మాత్రపు భద్రత కల్పిస్తున్నట్టు ఈ సంఘటనతో బట్టబయలైందన్నారు. సీఎం జగన్ పై విమర్శలు చేస్తే అక్రమ కేసులు, దాడులతో రాష్ట్రంలో భయానక వాతావరణన్ని అధికార పార్టీ నాయకులు సష్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఊట్ల సురేంద్ర నాయుడు, గుణశేఖర్ రాయల్, శంకర్, సుబ్బు యాదవ్, ధనంజయ పాల్గొన్నారు.

నారాయణస్వామి వెంటే ఉంటాం: సుందర రాజ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తమ గ్రామ సమస్యల పరిష్కారం కోసం గత నెల 28న మీడియా ముందుకు రావడం జరిగిందని, వెంటనే స్పందించిన ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి గ్రామ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు సర్పంచి సుందర రాజు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తామంతా వైసిపి కుటుంబ సభ్యులమేనని, తాము గ్రామ సమస్యలు మాత్రమే మీడియాకు తెలిపామని దాన్ని కొంతమంది వక్రీకరించారని అన్నారు. 2024 ఎన్నికల్లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి వెంటే ఉండి ఆయనను అఖండ మెజారిటీతో గెలిపించుకుని మళ్ళీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుంటామని స్పష్టం చేశారు. జగనన్న కాలనీల అభివద్ధి కోసం తాము పోరాడామని, త్వరలోనే జగనన్న కాలనీలలో అభివద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతాయని తెలిపారు. ఎంపీటీసీ పొన్నుస్వామి మాట్లాడుతూ గ్రామ ప్రజల అభిప్రాయంతో జ్యూస్ ఫ్యాక్టరీని పున్ణ ప్రారంభిస్తున్నామన్నారు.

అన్నమయ్య సంకీర్తనల్లో వేద విజ్ఞానసారం

తిరుపతి సిటి : శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల్లో వేద విజ్ఞానసారం ఇమిడి ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ మలయవాసిని చెప్పారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంతి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి . ఈ సందర్భంగా అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సు జరిగింది. డాక్టర్ మలయ వాసిని "అన్నమయ్య - ఆధ్యాత్మికత కీర్తనలు " అనే అంశంపై ఉపన్యసించారు. ఆనాటి రాజకీయ కాలమాన పరిస్థితుల కారణంగా ప్రజల్లో అడుగంటిన భక్తిభావాన్ని చైతన్య పరిచి ఆధ్యాత్మిక సమైక్యత సాధించేందుకు శ్రీవేంకటేశ్వరస్వామివారిని కేంద్రంగా చేసుకుని అన్నమయ్య సంకీర్తనలు రచించారన్నారు. రాజమండ్రి ఆంధ్రయువతి సంస్కత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పేరం నాయుడు, హైదరాబాద్ జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఆచార్య సముద్రాల రంగ రామానుజాచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డా.విభీషణ శర్మ పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- నాయుడుపేట

సెబ్ సీఐ ఆర్‌యూవిఎస్ ప్రసాద్ తనకు వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బంది, ఇన్ఫార్మర్‌లతో కలసి శుక్రవారం ఉదయం నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహించారు. విశాఖపట్నం నుంచి బెంగుళూరు వెళుతున్న బస్ లో గుజ్జారి సాగర్ అనే వ్యక్తి వద్ద నుంచి డెబ్బై వేలు విలువైన నాలుగు కిలోల వంద గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారించగా కాకినాడ కు చెందిన వినోద్ తను కలసి ఈ స్మగ్లింగ్ చేస్తున్నామని, వినోద్ వద్దనుండి ఇరవై వేలకు కొని బెంగుళూరులో డెబ్బై వేలకు అమ్ముతుంటాడని విచారణలో తేలిందని సీఐ ప్రసాద్ తెలియజేశారు. కాకినాడకు చెందిన వినోద్ ను అరెస్ట్ చేయవలసి ఉందని ఆయన వివరించాడు.

'మళ్ళీ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తాం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును మళ్ళీ ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని టిడిపి తిరుపతి పార్లమెంట్ కార్యదర్శిగా నియమితులైన యశ్వంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం దాదాపు 12 సంవత్సరాలుగా సామాన్య కార్యకర్తగా పనిచేస్తున్నానని, తన శ్రమను గుర్తించిన అధిష్టానం టిడిపి తిరుపతి పార్లమెంటు కమిటీ కార్యదర్శిగా నియమించిందన్నారు. మనోహర్ ఆచారి, నందగోపాల్ నాయుడు పాల్గొన్నారు.

గంగమ్మకు 'సారె'ల సందడి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్/ తిరుపతి సిటి

తిరుపతిలోని శ్రీ తాతయ్యగుంట గంగమ్మకు వరుసగా 'సారె'ల సందడి మొదలయ్యింది. శుక్రవారం ఉదయం మేయర్ డాక్టర్ శిరీష కుటుంబ సభ్యులతో సారె సమర్పించారు. స్థానిక పెద్దకాపు లేఅవుట్ లోని తన నివాసం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి , కుటుంబ సభ్యులు, నగరపాలక ఉపమేయర్లు, కార్పొరేటర్లు, బంధువులు, అభిమానులతో కలిసి ఊరేగింపుగా బయలుదేరారు. కోలాటాలు, డప్పులు, సప్పరాలు సన్నాయి వాయిద్యాల మధ్య, భక్తులు విచిత్ర వేషధారణలతో, కుటుంబ సభ్యులు ఆలయ ప్రదక్షిణ గా వెళ్లి గర్భాలయంలో అమ్మవారికి శేష వస్త్రాలు, పసుపు కుంకుమలతో కూడిన గంగమ్మకు పట్టువస్త్రాలతో సారెను సమర్పించారు. గంగమ్మ ఆలయ పాలకమండలి చైర్మన్ కట్ట గోపి యాదవ్, ఈవో, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష దంపతులు డాక్టర్ మునిశేఖర్, కమిషనర్ హరిత, కుటుంబ సభ్యులు తులసి, సురేష్, ఉప మేయర్లు భూమన అభినయ్, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, నగరపాలక అధికారులు అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, యస్.ఈ. మోహన్, హెల్త్ ఆఫీసర్ హరికష్ణ, మున్సిపల్ ఇంజనీర్లు, ఆర్.ఓ. వర్మ, వివిధ హాస్పిటల్ డాక్టర్లు, గంగమ్మ ఆలయ పాలకమండలి అధ్యక్షులు కట్టా గోపి యాదవ్, ఈవో మునికష్ణ, వైయస్సార్ సిపి నాయకులు దొడ్డ రెడ్డి సిద్ధారెడ్డి, ప్రతాప్ రెడ్డి, భారీ ఎత్తున నగర ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్, తిరుపతి అర్బన్ ఎస్పి సారె : తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటరమణరెడ్డి కుటుంబసభ్యులతో పాటు తిరుపతి అర్బన్ ఎస్పి పరమేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులు, ఏఎస్పి,డిఎస్పిలు వారి కుటుంబసభ్యులతో పాటు గంగమ్మకు సారె సమర్పించారు.

తోటివేషాలతో ఆలయం వద్ద భక్తుల సందడి : తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా శుక్రవారం నాలుగో రోజు తోటి వేషం వేసుకుంటారు. తోటి వేషంలో భాగంగా ఒంటిపై మసి బొగ్గు పూసుకుని, తెల్లని నామం, కనుబొమ్మలపైన చుక్కలు పెట్టుకోవడం సంప్రదాయం. చిన్నపిల్లలు మీసాలను ధరిస్తారు. తలపై వేపాకు మండలు, పాతపొరక చేతబట్టి వీధుల్లో సంచరిస్తూ వేషాలమ్మ తల్లి ఆలయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుంటారు.

గంగమ్మ జాతరను దేశవ్యాప్తం చేస్తాం : జేఈవో

తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ విశిష్టతను దేశవ్యాప్తంగా తెలియజేయడం కోసం టీటీడీ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది నుంచి గంగమ్మ జాతర వారోత్సవాలు నిర్వహిస్తామని జేఈవో సదా భార్గవి తెలిపారు. శ్వేతలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర విశిష్టతపై

ఉద్యోగులకు శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జేఈవో మాట్లాడుతూ గంగమ్మ జాతర వారోత్సవాలను మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తామన్నారు. తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి ఆలయ విశిష్టతను దేశ వ్యాప్తంగా తెలియజేయడం కోసం ఎంతో కషి చేస్తున్నారన్నారు. గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటింప చేయడానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. టీటీడీ సహకారంతో ఆలయాన్ని నిర్మించడానికి ఎమ్మెల్యే చేసిన ప్రయత్నానికి చైర్మన్ వై వి సుబ్బారెడ్డి, బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్ సహా అందరూ సహకరించారని చెప్పారు. టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు పోకల ఆశోక్ కుమార్ మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామి వారి చెల్లెలు తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని పునర్నిర్మానం చేసి, జాతరను రాష్ట్ర పండుగ చేయడానికి తిరుపతి శాసనసభ్యులు కరుణాకర్ రెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు. కంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ వందేళ్ళ నుండి ఇప్పటి వరకు జరిగిన తిరుపతి అభివద్ధి గురించి వివరించారు. విదేశాల్లోనూ గ్రామ దేవతలు ఉన్నారని అన్నారు.యోగి వేమన యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి ఆచార్య ఈశ్వర్ రెడ్డి గ్రామదేవతలు- ఆవిర్భావ వికాసాలు అనే అంశంపై ప్రసంగించారు. శ్రీపొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద విజ్ఞాన శాఖాధిపతి ఆచార్య భక్త వత్సల రెడ్డి తాతయ్యగుంట గంగమ్మ జాతర- సామాజిక, సాంస్కతిక నేపథ్యం గురించి విపులంగా వివరించారు. టీటీడీ మ్యూజియం ప్రత్యేకాధికారి ఆచార్య కష్ణారెడ్డి గంగమ్మ జాతర చరిత్ర గురించి తెలియజేశారు. జాతీయ సంస్కత విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ ఆచార్య నల్లన్న గంగమ్మ పూజా పద్ధతుల గురించి తెలియజేశారు. తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి గంగమ్మ జాతరలో వేషాలసంస్కతి- ప్రదర్శన గురించి వివరించారు. శ్వేత డైరెక్టర్ ప్రశాంతి నేతత్వంలో జరిగిన వర్క్ షాప్‌లో ఎస్వీ యూనివర్సిటీ ఓరియంటల్ విభాగం ఆచార్యులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జనుము సాగు... లాభాలు బాగు..!

ప్రజాశక్తి - బాలాయపల్లి

ఏ పంట అయినా సాగు చేసే ముందు జనుమును సాగు చేస్తే భూమికి సత్తువ అంది పంటకు లాభాలు బాగుంటాయి. సాధారణంగా ఖరీఫ్ వరి పంటకు ముందు జనుము విత్తనాలు చల్లి ఏపుగా ఎదిగిన తర్వాత దానిని దమ్ములో దున్నుతారు. దీని వల్ల వరి పొలం సారవంతమై అధిక దిగుబడులు రావడానికి ఈ జనుము ఎంతో ఉపయోగపడుతుంది.

తక్కువ ఖర్చు...లాభాలు అధికం

మిరప లాంటి పంటలకు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి నష్టాలను చవిచూసి విసుగు చెందిన రైతులు.. పంటమార్పిడి వైపు దష్టి సారించారు. తక్కువ ఖర్చుతో.. చీడపీడల బాధ లేకుండా లాభాలను తీసుకొచ్చే జనుము సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జనుము పూత, కాయ దశలో ఉంది. ఎటువంటి పెట్టుబడి లేకుండా పురుగుల మందు బాధ పెద్దగా లేకుండా ఈ పంట పండుతోంది. సేద్యంలో రైతు పూర్తిగా రసాయనిక ఎరువుల పైనే ఆధారపడటం వల్ల సాగులో అనేక సమ స్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. సేంద్రీయ ఎరువు లు వాడక పోవటం వల్ల భూసారం తగ్గి , దిగుబడు లు గణనీయంగా పడిపోతున్నాయి. పెట్టుబడి భారం పెరుగుతోంది. ఈసమస్యలను అధిగ మించడానికి ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట పైర్లను ప్రోత్సహిస్తోంది.

పోషకాలు అధికం : శిరీష, బాలాయపల్లి వ్యవసాయ శాఖ అధికారిణి

పచ్చ రొట్టె విత్తనాలు (జనుము) సాగు చేయడంతో రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుంది. ఇక పోషకాలు అధికంగా పెరగడంతో పంటకు పెట్టుబడి తగ్గుతుంది..

తాతయ్యగుంట గంగమ్మకు ముక్కంటి సారె

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతి నగరంలో వెలిసిన తాతయ్యగుంట గంగమ్మకు శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర ఆలయం తరపున ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు, ఆలయ అధికారులు సారె సమర్పించారు. తిరుపతిలో గంగజాతరను పురస్కరించుకుని తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి చేతుల మీదుగా తాతయ్యగుంట గంగమ్మ తల్లికి సారె సమర్పించారు. తాతయ్యగుంట ధర్మకర్తల మండలి ఛైర్మన్ గోపి యాదవ్, ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో తిరుపతి కార్పోరేషన్ డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, పాలగిరి ప్రతాప్ రెడ్డి, ఎస్కె బాబు, శ్రీకాళహస్తి ధర్మకర్తల మండలి సభ్యులు కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు జూలకంటి సుబ్బారావు, శ్రీదేవి, ఛైర్మన్ సీసీ సుదర్శన్ రెడ్డి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరరాజా స్కూల్‌లో 100 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని కరకంబాడి అమరరాజా విద్యాలయ విద్యార్థులు శుక్రవారం విడుదల చేసిన 10వ తరగతి సీబీఎస్ఈ ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. వారిలో కె.సాయి దీపక్ 500 మార్కులకు 454 మార్కులతో మొదటి స్థానంలో నిలవగా, యశ్వంత్ సాయి 450 మార్కులతో రెండవస్థానంలో, యం.వి.కల్పన 447 మార్కులతో మూడవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.

వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: బాల బాలికలు వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు గ్రంథాలయ అధికారి మీనా కుమారి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయ శాఖలో వేసవి శిక్షణ శిబిరం సాగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లీష్ కథలు చెప్పడం, యోగ, డ్రాయింగ్, జీకే వంటి అంశాలతో శిక్షణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో పఠనా శక్తిని పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ సమ్మర్ క్యాంపునకు పంపి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. వాలంటరీగా పై అంశాలపై పిల్లలకు శిక్షణ ఇవ్వడానికి ఎవరైనా ముందుకొస్తే నెం.9490394867రులో గ్రంథాలయ అధికారిని సంప్రదించవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ వినియోగించుకొని, తమ విజ్ఞాన పాఠ్యాలను మరింత మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం ఎస్‌బి పురం ప్రాథమిక పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులు పైబడిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీరంజారాణి అధ్యక్షతన శుక్రవారం అభినందన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో 576 మార్కులతో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని చాందిని, ఔషన్ 563 మార్కులు, వైష్ణవి 534, జశ్వంత్ 525 మార్కులు పొందిన విద్యార్థులను పాఠశాల తరపున పుష్పగుచ్ఛం, శాలువా, ప్రశంసాపత్రంతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్‌పర్సన్ లలిత, ఉపాధ్యాయబందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు భోజనం పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని రెడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగులకు భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా మారుబోయిన చిరంజీవి గౌడ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు మారుబోయిన శ్రావణ్ కుమార్ గౌడ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. దాతల సహకారం మరువలేనిది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్ సభ్యులు అస్లాం పాల్గొన్నారు.

మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: మండలంలోని చిన్న పాండూరు రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మురళి నాయుడు అధ్యక్షతన మండల వ్యవసాయ అధికారిణి సుహార్ లత వ్యవసాయ సలహా మండలి సమావేశంను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి మాట్లాడుతూ ఈ సంవత్సరం చిరు ధాన్యాల సంవత్సరంగా వ్యవసాయ శాఖ నిర్ణయించడమైందని, కావున రైతు సోదరులు చిరు ధాన్యాల సాగు చేయాలని కోరారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, పచ్చిరొట్ట విత్తనాలు త్వరలో వస్తాయని తెలిపారు. ఛైర్మన్ మురళి నాయుడు మాట్లాడుతూ రైతులందరూ రైతు భరోసా కేంద్రాల్లోని సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పంటల కాలానుగుణ పరిస్థితులను చర్చించారు. అనంతరం రైతు భరోసా మాస పత్రికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి ప్రవీణ్, గ్రామ సర్పంచ్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సీఎం జగన్ వెంటే: మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ఆంధ్రప్రదేశ్‌లోని కోట్లాది మంది జనం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వెంటే ఉన్నారని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నగొట్టి గల్లు పంచాయతీలో మోహిత్ రెడ్డి పాద యాత్ర చేశారు. ఆయనకు ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ సహదేవరెడ్డి, జడ్పిటిసి స్వరూప మహేందర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు అన్వర్ బాషా, ఎంఆర్‌పిఎస్ నాయకులు గురుశంకర్, సర్పంచ్‌లు తదితరులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారు. ఎవరో వచ్చి ఏదో చేస్తామంటే ఇప్పుడు ఇస్తున్న సంక్షేమ పథకాలు వదులుకోవటానికి సిద్ధంగా లేరన్నారు. అభివృద్ధి జరిగింది అంటే అది వైఎస్సార్, జగన్‌మోహన్ రెడ్డి హయాంలో నన్నారు. జగన్‌మోహన్ రెడ్డి రైతుల పక్ష పాతి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం వరుణ దేవుడు కరు ణతో చెరువులు, కుంటలు నిండు కుండలా పొంగి పొర్లుతున్నాయి. మన రాష్ట్రంలో ఇప్పటికీ ఒక్క కరువు మండలంగా ప్రకటించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన గడపగడపకు తిరుగుతూ ఆప్యాయంగా ప్రజలను పలకరిస్తూ వారి యోగక్షేమాలు, సమస్యలు అడిగి తెలుసుకొంటూ అధికారులకు సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ పాదయాత్ర కొనసాగించారు. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నానని, ప్రజలందరూ ఆదరించాలని ఈ పాదయాత్రలో మోహిత్ రెడ్డి కోరారు.

లీలా స్పైసీ రెస్టారెంట్ ప్రారంభం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని అక్కారంపల్లి కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ వారి లీలా స్పైసీ మల్టీకుషన్ రెస్టారెంట్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. తిరుమల, తిరుపతి నగరంలోని రాజకీయ నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో ప్రారంభోత్సవానికి హాజరై ఎస్ఎస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.బాలశ్రీనివాసులు, నారాయణను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి, డాలర్స్ గ్రూప్ ఆఫ్ ఛైర్మన్ దివాకర్ రెడ్డి, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, 50వ డివిజన్ కార్పొరేటర్ అనిల్ కుమార్, 1 డివిజన్ కార్పొ రేటర్ రాధాకష్ణారెడ్డి, ఆదం సుధాకర్ రెడ్డి, వైసిపి తారకరామా నగర్ ఇన్‌ఛార్జ్ మన్యం శ్రీనివాసులు రెడ్డి(ఎంఎస్ఆర్), తిరుమల వైసీపీ అధ్యక్షులు రాచవేటి చిన్నముని తదితరులు పాల్గొన్నారు.

సిబిఎస్ఇ పది ఫలితాల్లో ఎల్‌ఎపి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: సిబిఎస్ఇ 2022-23 సంవత్సరం పదో తరగతి ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో చిల్లకూరు సమీపంలోని శారదానగర్‌లోని ఎల్‌ఎపి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చదివిన పదవ తరగతి విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. పరీక్షకు హాజరైన 77 మంది విద్యార్థుల్లో 30 మంది 500 మార్కులకు పైగా సాధించారు. పది విద్యార్థులందరూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు కావడంతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు కావడం సంతోషంగా ఉందన్నారు. అక్షయ్ కార్తీక్ అనే విద్యార్థి 585 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచారన్నారు. ప్రియాంక 576, హన్సిక 574 మార్కులతో తరువాత స్థానాల్లో నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -సత్యవేడు: స్థానిక స్త్రీ శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న పలు అంగన్వాడీ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ఐసిడిఎస్ అధికారిణి దేవ కుమారి శుక్రవారం చెప్పారు. ఈ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సంబంధించి సత్యవేడు పట్టణంలోని యానాది కాలనీ అంగన్‌వాడీ కేంద్రం(ఎస్టి) కేటగిరికి, బుచ్చినాయుడు కండ్రిగ మండలం కాంపాలెం దళితవాడ అంగన్‌వాడీ కేంద్రం(ఎస్సీ), కాటూరు(ఓపెన్ కేటగిరి), అలాగే అంగన్‌వాడీ హెల్పర్లకు సంబంధించి సత్యవేడు మండలం ఆర్‌సి పురం అంగన్‌వాడీ కేంద్రం (ఓపెన్ కేటగిరి), రాసపాల్యం (బిసి-బి), వరదయ్యపాలెం మండలంలో లక్ష్మీపురం-2 అంగన్‌వాడీ కేంద్రం(ఓపెన్ కేటగిరి), కడూరు(ఎస్సీ), కురింజలం(బిసి-బి), ఆర్ఆర్ పాళ్యం(ఎస్టి), గూడవారిపాలెం(ఓపెన్ కేటగిరి), వరదయ్యపాలెం దళితవాడ(ఎస్సీ), కారిపాకం-1(బిసి-బి), నాగానందాపురం (ఎస్సీ), బుచ్చినాయుడు కండ్రిక మండలం కాటూరు(ఓపెన్ కేటగిరి), ఆదిరెడ్డి కండ్రికి(ఓపెన్ కేటగిరి) రిజర్వ్ చేసినట్టు ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారిణి మాట్లాడుతూ పై పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు పదవ తరగతి ఉత్తీర్ణులు కావడంతో పాటు వివాహమై స్థానికులుగా ఉండాలన్నారు. 2023 జులై 1వ తేదీ నాటికి వయసు 21 సంవత్సరాలు నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలి అన్నారు. అర్హులైన వారు దరఖాస్తుల కోసం సత్యవేడు ఐసిడిఎస్ కార్యాలయం పనివేళల్లో వచ్చి తీసుకోవచ్చు అన్నారు. మే 12 నుంచి 20వ తేదీ లోపల దరఖాస్తులు చేసుకోవడానికి తుది గడువు అన్నారు.

పెద్దపైనపల్లిలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-పాకాల: మండలంలో పెద్దపైన పల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా తెలుగుదేశం పార్టీ మండల నాయకులతో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారెడ్డి మాట్లాడుతూ ఏళ్ల తరబడి గ్రామాన్ని వేధిస్తున్న డ్రైనేజీ సమస్య, అర్హులకు ఇళ్ల పట్టాలు, హౌసింగ్ ఇవ్వకపోవడం వైసీపీ చేతకాని ప్రభుత్వానికి నిదర్శనమని అన్నారు. ఏళ్ల తరబడి డ్రైనేజీ సమస్య పట్టిపీడిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బైనపల్లి, కందేరి ఇండ్లు, గొల్లవాని ఇండ్లు, దాసరిపల్లి గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు.

రామగిరిలో అష్టమి పూజలకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలోని రామగిరిలో వెలిసిన శ్రీ కాళికాంబ సమేత శ్రీ సంతాన కాలభైరవ స్వామి ఆలయంలో శుక్రవారం అష్టమి పూజలకు భక్తులు పోటెత్తారు. ఈ ఆలయం పల్లవుల కాలం నాటి ప్రాచీనమైనది కావడం విశేషం. ఉదయం నుంచి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు చేరుకొని నువ్వుల నూనెతో నేతి దీపాలు వెలిగించి కాల భైరవునికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో కొలువుదీరిన కాలికాంబ అమ్మవారు, సంతాన కాలభైరవ స్వామి, స్వయంభు శ్రీ వాలీశ్వరస్వామి, శ్రీ మరగదాంబిక అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఉదయం మూలవిరాట్‌లకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకం చేసి అలంకరణలు చేశారు. మధ్యాహ్నం దాతలు ఆలయ ప్రాంగణంలోని భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల తాకిడి కొనసాగడం విశేషం.

రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులను కలిసిన శ్రీసిటీ ఎండీ



ప్రజాశక్తి-సత్యవేడు: రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి, డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డిని వారి వారి కార్యాలయాలలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, శ్రీసిటీ పరిసర ప్రాంతాలలో అభివద్ధి, శాంతిభద్రతలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీసిటీని సందర్శించాలని వారిని ఆహ్వానించారు. అనంతరం శ్రీసిటీ ఎండీ మాట్లాడుతూ శ్రీసిటీ వేగవంతమైన అభివద్ధి, పరిసర ప్రాంతాల ఆర్థికాభివద్ధికి ఇది ఎలా దోహదపడుతుందనే అంశాలను అధికారులకు వివరించారు. రాష్ట్రాన్ని పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఆయన ప్రశంసించారు. డైనమిక్ ముఖ్యమంత్రి నాయకత్వంలో, సులభతర వ్యాపారం, వ్యాపార అనుకూల విధానాలతో ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులను ప్రభావితం చేస్తూ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని అన్నారు.

'జీఓ-1 రద్దు ప్రజా విజయం'

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే గాక ప్రతిపక్షాల గొంతు నెక్కేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.1ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేయడం ప్రజా విజయం అని చిత్తూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతి నిధి చినబాబు శుక్రవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక, ఫ్యాక్షన్ పాలనపై ప్రజాస్వామ్యం గెలిచిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు గౌరవం ఇవ్వాలన్నారు.

కోట: రాజ్యాంగ విరుద్ధంగా, ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగే విధంగా రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నెం.1ని కొట్టివేస్తూ రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పు హర్షణీయమని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూపిలి రాధాకష్ణారెడ్డి శుక్రవారం అభిప్రాయపడ్డారు.

శ్రీకాళహస్తి: ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసే జీవో నెం.1ని రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. శుక్రవారం వైసీపీ సర్కారు ఇచ్చిన జీవో నెం.1పై రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో టీడీపీ నేతలు శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దశరథాచారి, కంఠా రమేష్, మిన్నల రవి, మునిరాజా యాదవ్, నెమళ్లూరు బుజ్జి, అస్మత్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

'అధికార పార్టీ ఆగడాలు అరికట్టాలి'

ప్రజాశక్తి-కెవిబి పురం: ఓజిలి మండలంలో మధ్యాహ్న భోజన కార్మికురాలుగా పనిచేస్తున్న వజ్రమ్మను ఆ మండల ఎంఈఓ ఎలాంటి రిమార్కులు లేకపోయినా అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి వజ్రమ్మను విధులకు రానీయకుండా తొలగించారని, తొలగించిన వజ్రమ్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కేవీబీపురం సిఐటియు మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక అధికారులు తమ చేతివాటాన్ని చూపుతున్నారన్నారు. అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్న ఎంఈఓపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని నాగరాజు డిమాండ్ చేశారు. వజ్రమ్మను విధుల్లోకి తీసుకోకపోతే సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.

ముగిసిన వసంతోత్సవాలు

ప్రజాశక్తి-చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన వసంతోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి, శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకష్ణస్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపుగా తీసుకొచ్చి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ, వీధి ఉత్సవం నిర్వహించారు. ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్లు చెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్ రెడ్డి, ధన శేఖర్, ఆలయ అర్చకులు బాలాజి రంగాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నర్సులకు సన్మానం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శ్రీ కష్ణ సేవా సమితి ఫౌండర్ మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్‌లో సేవలు అందిస్తున్న నర్సులను శుక్రవారం ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలకు నర్సులు చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ షరీనా, ఆర్ఎంఓ సందీప్ శ్రీనివాస్, డాక్టర్ చంద్రహాస్, హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సుల కృషి

అతీతమైందని స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకొని పుత్తూరు ప్రభుత్వ ఆస్పటల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెడ్ నర్స్ దిల్ నిషాకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. నర్సులు, ప్రభుత్వ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-రేణిగుంట: స్థానిక పట్టణం, అలాగే కరకంబాడి, గాజుల మండ్యం, ఎల్లమండెం, గురవరాజు పల్లె, తూకివాకం పంచాయతీ లలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని శుక్రవారం ఒక ప్రకటనలో ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ మరమత్తుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

గల్లంతైన బాలుడు మృతి

ప్రజాశక్తి-సత్యవేడు: స్థానిక తెలుగు గంగ కాలువలో గల్లంతైన బాలుడు మృతి చెందినట్లు వైద్యులు శుక్రవారం నిర్ధారించారు. వివరాలు... సత్యవేడు గ్రామానికి చెందిన భక్తులు కుటుంబ సమేతంగా శ్రీసదవాలమ్మ ఆలయం వద్ద అమ్మవారికి పొంగళ్ళు నివేదించే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో ముగ్గురు చిన్నపిల్లలు ఆడుకుంటూ ఆలయం వెనుకవైపు ఉన్న తెలుగు గంగ కాలువలో మునిగిపోయారు. దీన్ని గమనించిన స్థానిక యువకులు ఇద్దరు పిల్లలను కాపాడారు. స్థానిక పల్లావువీధికి చెందిన పవన్ కుమార్ కుమారుడు పవన్ తేజ్(4) గంగ కాలువలో పూర్తిగా గల్లంతు కాగా యువకులు గాలింపు చర్యలు చేపట్టి బాలుడిని సత్యవేడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుడిని బ్రతికించేందుకు వైద్యులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో గ్రామంలో విషాధ చాయలు అలుముకున్నాయి.

వైసీపీ నాయకుల నివాళులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పుత్తూరు మండలం తిరుమలకుప్పం గ్రామపంచాయతీ సర్పంచ్ ఎం సరస అత్త, ఎం వెంకటేశులు అమ్మ శుక్రవారం స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రివర్యులు ఆర్కే రోజా సోదరులు వైసీపీ నాయకులు వై కుమారస్వామి రెడ్డి తిరుమల కుప్పం గ్రామానికి చేరుకొని భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, పుత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్, పుత్తూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ శంకర్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నాటక పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: సంస్కృతి సమ్మేళనం గూడూరు ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో జాతీయ స్థాయి నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ముని గిరీష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నాటక పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ముని గిరీష్ మాట్లాడుతూ ఈ పోటీలలో కరుణ, హాస్యం, సందేశం కలిగించే అత్యుత్తమ నాటకాలను ఎంపిక చేశామని చెప్పారు. గూడూరులో నాటకాలకు విపరీతమైన ఆదరణ ఉందని తెలిపారు. సంస్కృతి సమ్మేళనం ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా నాటక పోటీలను నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు పాల్గొని, విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు సోమిశెట్టి చెంచురామయ్య, జానా శివయ్య, కట్ట మురళీకష్ణ, జి.జి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సామాను శ్రీధర్ రెడ్డి దాతృత్వం

గంగ జాతరకు రూ.2.60 లక్షల విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సంఘ సేవకుడు, మానవతావాది సామాను శ్రీధర్ రెడ్డి మరోసారి తన దాతత్వం చాటుకున్నారు. శ్రీకాళహస్తి మండలం దొమ్మరపాళెంలో జరుగుతున్న గంగజాతరకు శుక్రవారం రూ.2.60లక్షలు విరాళం జాతర కమిటీ సభ్యులకు అందజేశారు. దాత సామాను శ్రీధర్ రెడ్డికి వారు కతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా సామాను శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవే తన పరమార్థమన్నారు. దొమ్మరపాళెంలో జరిగే గంగజాతరకు ప్రతి యేటా తనవంతు సాయం చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి తాను ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నానని చెప్పారు. దైవ కార్యక్రమాలకు తనవంతు సాయం చేస్తూ భక్తి చాటుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా పేద విద్యార్థుల చదువుకు కూడా తనవంతు సాయం చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను గంగజాతర కమిటీ సభ్యులు సన్మానించి, గంగమ్మ తల్లి ఆశీస్సులతో ఎల్లవేళలా సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వచనం ఇప్పించారు.

'ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల దందాను అరికట్టండి'

ప్రజాశక్తి-క్యాంపస్: ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల దందాను అరికట్టాలని తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డీఈఓ ఆఫీస్‌లో ఏడీ కి టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్, నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునః ప్రారంభంకానున్న నేపథ్యంలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు మీ దష్టికి తీసుకువస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో విష్ణు వర్ధన్, చరణ్, జయప్రకాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి హనుమాన్ జయంతి



ప్రజాశక్తి-గూడూరు టౌన్: స్థానిక కొనేటిమిట్టలో వెలిసిన శ్రీ కోదండ రామాంజనేయ స్వామి దేవాలయంలో ఛైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన హనుమజయం తిని పురస్కరించుకుని 13, 14 తేదీల్లో అనేక కైంకర్యాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తలు బత్తిన వేణుగోపాల్, దగ్గోలు సురేంద్రబాబు, ఉప్పల పెంచలయ్య, మదనమేటి రమణయ్య, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు నారాయణ స్వామి, సాయి పవన్, అటెండర్ విశ్వనాథం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.